ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:23 (గురు)
సహరి : 4:44 (శుక్ర)



సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి అక్రమాలు జరగకుండా సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు చేపట్టింది. అక్రమాలకు అడ్డుకట్ట వేసే అన్ని రకాల వనరులను ఉపయోగిస్తోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన 'సీ విజిల్' యాప్. ఎన్నికలలో నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు సామాన్య ప్రజలు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు.

ఓటర్ల చేతిలో పాశుపతాస్త్రం

సీ విజిల్

సీ విజిల్ అంటే ఏమిటి ?

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ సీ విజల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు సైతం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని సాక్ష్యాలతో సహా ఇందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఐదు నిమిషాల్లోనే రంగంలోకి

ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేసుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చు.



- ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈసీ ప్రయోగం
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లోనే స్పందన.. వంద నిమిషాల్లో చర్యలు



భీమవరం టౌన్, మార్చి 20 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశంతో అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్ళు లేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పని చేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించే వారిపై దీని ద్వారా చర్యలు తీసుకోనుంది.

ఎలా ఫిర్యాదు చేయాలి..



- యాప్ తెరవగానే స్ర్కీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి.
- ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి.
- మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి.
- ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం, తదితర వివరాలను నమోదు చేయాలి.
- సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది.
- యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి సంబంధిత విషయంపై విచారణ జరుపుతారు.
- సీ-విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు.
- ఇక్కడ ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

ఫిర్యాదులపై చర్యలు : జేసీ



ఉండి, మార్చి 20 : సీ-విజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికపుడు పరిష్కరించేలా చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పశ్చిమ గోదావరి జేసీ, ఉండి రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. బుధవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియ మావళి ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా స్వీకరిస్తున్నాం. కలెక్టరేట్ కంట్రోల్ రూంలో సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచాం. జిల్లాస్థాయిలో స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో నిఘా బృందాలు, వీడియో వీక్షణ బృందాలు ఏర్పాటు చేశాం. ఫిర్యాదులపై 1950 నెంబరుకు కాల్ చేయవచ్చు. ఎన్నికల విధులకు వలంటీర్లు సహకరిస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామ'న్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

- ముందుగా సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సెల్‌ఫోన్ నంబరు ద్వారా దానిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఓటీపీ వస్తుంది. దీనిని ఎంటర్ చేసుకుంటే సీ విజిల్ యాప్ సిద్ధమైనట్లే.



ఎలాంటి ఫిర్యాదులు చేయాలి ?

- ఎన్నికల ప్రవర్తన నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చు.
- డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాలలో తరలించడం, ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయాలి.



- ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘనలు కనిపిస్తే ఎవరైనా సీ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డు కట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి. ఫిర్యాదులపై వంద నిమిషాలలో పరిష్కారానికి చర్యలు చేపడతాం. ఓటర్లు ఈ సీ విజిల్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి. ఎన్నికల్లో అక్రమాలపై ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చర్యలు తీసుకుంటాం.

- కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

అడ్డుకట్ట వేసేందుకే 'సీ విజిల్'

తాయిలాలు పంచి అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమగీతం పాడవచ్చు. బాధ్యత గల పౌరుడిగా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయాలి. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు, రాజ్యాంగ బద్ధంగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగేందుకు పౌరుడిగా మనవంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ఈ యాప్ దోహదం చేస్తుంది.



24 గంటల్లో ఇద్దరిపై దాడి చేసిన మెడికో


దాడి చేసిన మెడికో చాణక్య

ఏలూరు క్రైం, మార్చి 20 : ఒక యువకుడు 24 గంటలు జరగక ముందే ఇద్దరిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు ఒక్క కేసును నమోదు చేసి రెండో ఘటన జరగ్గానే మొదటి కేసును సెక్షన్ మార్పు చేశారే తప్ప రెండో కేసు నమోదు చేయక పోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన పాలడుగు చాణక్య విదేశాల్లో వైద్య విద్యను అభ్య సిస్తున్నాడు. తుది పరీక్షలు రాయాల్సి ఉంది. ప్రస్తుతం ఏలూరులోని తన ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇంటి పక్కన జాలిపూడినకు చెందిన కార్పెంటర్ ఎన్.దుర్గా సురేష్ వడ్రంగి పని చేస్తున్నాడు. మిషనరీ ఎక్కువ శబ్దం వ స్తోందని పని ఆపేయాలని చాణక్య చెప్పాడు. అయితే పనిచేసేటప్పుడు శబ్దం వస్తుందని సురేష్ చెప్పడంతో ఆగ్రహించిన అతను చాకుతో రెండు చేతులపై, వీపుపై సురేష్‌ను పొడిచాడు. గాయాల పాలైన అతను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళాడు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి టూటౌన్ పోలీసులకు పిర్యాదు ఇవ్వడంతో పోలీసులు ఐపీసీ 324 కింద నమోదు చేశారు. వాస్తవానికి ఐపీసీ 307 (హత్యాయత్నం) నమోదు చేయాల్సి ఉంది. ఈ కేసులో నిందితుడిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కాగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో డీమార్టు సమీపంలో ఒక కారు నడుపుతున్న వ్యక్తి హారన్ వేశాడు. అటుగా మోటారు సైకిల్‌పై వస్తున్న చాణక్య ఆగ్రహించి తన బ్యాగ్‌లో ఉన్న చాకుతీసి కారునడిపే వ్యక్తిపై దాడిచేసి వేలు కోసి, చేతులపై పొడిచాడు. అక్కడున్న వారు అతన్ని నిర్బంధించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బ్లూకోడ్ పోలీసులు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. 24 గంటలు కాకముందే చాణక్య ఇద్దరిపై దాడి చేశాడు. రెండో ఘటనకు చాణక్య పాల్పడడంతో ఆ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకుండా వడ్రంగి మేస్త్రిపై జరిగిన దాడి కేసు సెక్షన్‌ను ఐపీసీ 324 నుంచి 326గా మార్పు చేసి చాణక్యను అరెస్టు చేశారు.


చాట్రాయిలో అకాల వర్షానికి తడిచిన మొక్కజొన్న పంట

అకాల కష్టం..

- ఈదురు గాలులతో భారీ వర్షం
- మొక్కజొన్న, మిర్చి రైతులకు తీవ్ర నష్టం
- పోలవరంలో మసీదుపై కూలిన కొబ్బరి చెట్టు
- చొదిమెళ్ళలో పిడుగు పడి రైతు మృతి

ఏలూరు సిటీ/ లింగపాలెం/బుట్టాయగూడెం/ పోలవరం/ చాట్రాయి/ జీలుగుమిల్లి/ పెదవేగి/ చింతలపూడి, మార్చి 20 : జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం అకాల వర్షం కురిసింది. ఉదయం నుంచి కొంత చల్లగా ఉన్న వాతావరణంలో మధ్యాహ్నం నుంచి మార్పులొచ్చి అకాల వర్షం కురిసింది. గురువారం కూడా జిల్లాలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం రబీ సీజన్ కొనసాగుతుండడం, మరో పక్క మామిడితోటలు కాపునకు సిద్ధంగా ఉండడంతో ఈ వర్షాలు రైతులను భయపెడుతున్నాయి. ఇక నిన్న మొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన ప్రజలకు ఈ అకాల వర్షాలు కొంత ఉపశమనం కలిగించాయి. బుధవారం రాత్రి నుంచి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో చలి గాలులు వీస్తున్నాయి.

లింగపాలెం మండలంలో పొలాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న, కల్లాల్లో ఎండ బెట్టిన ఎండుమిర్చి తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షం కురవడంతో మిర్చి తడిచి తాలుకాయ ఎక్కువగా వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిచౌంగ్ తుఫాన్ ధాటికి ఇప్పటికే మిర్చి పాడైపోయిందని, కొద్దిమాత్రంగా పండిన పంట అకాల వర్షానికి తడిచిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మాజీగూడెంలో చింతలపూడి ప్రధాన రహదారి గోతులు వర్షపు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. సరైన డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపై నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బుట్టాయగూడెం మండలంలో ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిశాయి. పోలవరం మండలంలో ఈదురు గాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు వంద ఎకరాల మొక్కజొన్న చేలు నేలకొరిగాయి. ఎల్ఎన్‌డీపేట, చేగొండపల్లి, జిల్లెళ్లగూడెం, వింజరం, ప్రగడపల్లి, ఇటుకలకోట, పోలవరం, పట్టిసీమ, గెడ్డపల్లి, కొత్తపట్టిసీమ, గూటాల పంచాయతీల పరిధిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. కన్నాపురం, కొవ్వూరు రోడ్డు మార్గాల్లో పలుచోట్ల చెట్లు పొదలు ఈదురుగాలులకు రోడ్డుపై పడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వర్షానికి కల్లాలపై ఉన్న మొక్కజొన్న పంటలను రైతులు ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. పోలవరంలో బెస్తా వీధి, మెయిన్ రోడ్డులో రోడ్లపై వర్షం నీరు నిలిచి జనం ఇబ్బందులకు గురయ్యారు. పోలవరంలో అహెలె సున్నత్ జమాతె మసీదు వద్ద కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై నుంచి మసీదుపై పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రస్తుతం రంజాన్ ఉపవాస ప్రార్థనలు కావడంతో ఇఫ్తార్ విందు కోసం కొబ్బరి చెట్టు కూలిన ప్రాంతంలోనే వంటకం తయారు చేయాల్సి ఉంది. ఆ సమయంలో వండే వారు అక్కడ లేక పోవడంతో పెనుప్రమాదం తప్పిందని రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు తెలిపారు. చాట్రాయి మండలంలో అకాల వర్షంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక్కసారిగా పెద్ద వర్షం రావడంతో రైతులు కల్లాల మీద ఉన్న మొక్కజొన్న పంటను తడవకుండా జాగ్రత్తలు తీసుకోలేకపోవడంతో పంట తడిసి ముద్దయింది. రబీలో సుమారు 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగింది. ప్రస్తుతం 50 శాతం పంట కల్లాలపై ఉంది. వర్షం వల్ల ట్రాక్టర్లు రెండు రోజుల వరకు తోటల్లోకి వెళ్లడానికి అవకాశం లేదని ఈలోగా మొక్కజొన్న కండెలు పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెం, రాచన్నగూడెం, లక్ష్మీపురం, ములగలంపల్లి తదితర గ్రామాల్లో చెదురు మదురు వర్షం పడింది. పొగాకు బ్యారన్‌ల వద్ద పొగాకు, మిర్చి కల్లాల్లో పంట తడవకుండా రైతులు బరకాలు కప్పారు. పెదవేగి మండలంలో పిడుగులతో కూడిన వర్షం ఒక్కసారిగా రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మొక్కజొన్న పంట విరుపు సమయంలో పడిన వర్షంతో మొక్కజొన్న కొంతమేర నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని రైతులు వాపోతున్నారు. గార్లమడుగు, వెంకటకృష్ణాపురంల్లో ఉరుములు, పిడుగులతోపాటు వడగళ్ళు పడడంతో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. గోపన్నపాలెం- బాదరాల రోడ్డులో దిబ్బగూడెం దగ్గర రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చింతలపూడి పరిసర గ్రామాల్లో ఉరుములతో కూడిన అకాల వర్షం పడింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. ఏలూరు-చింతలపూడి రోడ్డులో పలుచోట్ల గుంతల్లో నీరుచేరి చెరువుల్లా మారాయి.


పోలవరంలో మసీదుపై కూలిన కొబ్బరి చెట్టు


మృతి చెందిన సత్యనారాయణ

పిడుగు పడి రైతు మృతి

ఏలూరు క్రైం, మార్చి 20 : ఏలూరు సమీపంలోని చొదిమెళ్ళకు చెందిన రావూరి రాటాల వెంకట సత్యనారాయణ (45)కు భార్య ప్రియాంక, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తీవ్ర గాలులతో ఉరుములు, చిరుజల్లులు పడుతుండగా ఇంటి సమీపంలోని గడ్డివాము తడిచిపోతుందని భావించి ఇంట్లో నుంచి పరుగున వెళ్లి గడ్డివాముపై బరకం కప్పుతున్నాడు. ఆకస్మాత్తుగా పిడుగు పడడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బర్రింకలపాడు వద్ద మిర్చి కల్లంపై బరకాలు కప్పుతున్న మహిళలు



పోలవరంలో మొక్కజొన్న కండెలను ఒబ్బిడి చేస్తున్న రైతులు, నేలకొరిగిన మొక్కజొన్న

వివక్ష చూపారో..



వేటు తప్పదు : ఉద్యోగులపై నిరంతర నిఘా

- అధికార పార్టీకి అనుకూలంగా పలువురు
- వారిపై ఫిర్యాదు చేస్తున్న ప్రతిపక్షాలు
- ఎన్నికల సంఘం సీరియస్
- భీమవరంలో బరితెగిస్తున్న వలంటీర్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఓ పోలీస్ అధికారి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ టీడీపీ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం ఫ్లెక్సీల తొలగింపులో అలసత్వం వహించారంటూ ఆచంటలో ఐదుగురు కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీచేశారు. ఉండి మండలం ఉణుదుర్రులో తొమ్మిది మంది వలంటీర్లు, మొగల్తూరు మండలం పాతపాడులో ఇద్దరు వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ద్వారకా తిరుమల మండలం పంగిడిగూడెం పంచాయతీ మెట్ట పంగిడిగూడెంలో ఆదివారం హోం మంత్రి తానేటి వనిత ఎన్నికల ప్రచారంలో 'వైసీపీని గెలిపించేం దుకు మీరు సిద్ధమా' అంటూ డ్వాక్రా వీవోఏ కొప్పిశెట్టి వెంకటేశ్వరమ్మ ప్రసంగించి కోడ్‌ను ఉల్లంఘించారు.

ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినా అధికార పార్టీ నేతలు ఉద్యోగులను తమ ఆధీనంలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే కొందరి వ్యవహార శైలి ఉంది. వీటిపై టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు పట్టణాలు, మండల కేంద్రాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీ శ్రేణులను ముందుంచి కవాతు చేపడుతున్నారు. ఏమంటే ఎన్నికలు సజావుగా నిర్వహించేలా సహకరించాలని వారిని కోరినట్టు సమర్థించుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు చూసి ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ఎన్నికల అధికారుల కు ఫిర్యాదు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఎన్నికల నియమావళికి అనుగుణంగా రాజకీయ పార్టీలు సహకరించాలంటూ అఖిల పక్ష నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు ఉద్యోగుల విషయంలో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినా సరే కొందరు అధి కార పార్టీకి తొత్తులుగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఉమ్మ డి పశ్చిమ గోదావరిలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మెమోలు జారీచేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యోగులపైనా చర్యలకు ఎన్నికల సంఘం ఉపక్రమిస్తోంది. ఇప్పటికే అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. సిద్ధం సభకు హాజరయ్యారంటూ వలంటీర్లను తొలగించారు. జిల్లాలో ఉద్యోగులను ఎన్నికల అధికారులు అప్రమత్తం చేశారు. అధికారుల చాంబర్‌లో వున్న సీఎం జగన్ ఫొటోలను తొలగించారు. జగన్ బొమ్మలతో కూడిన ధ్రువీకరణ పత్రాలకు స్వస్తి పలికారు. అయినా సరే కొన్ని శాఖల్లో ఉదాసీనత కనిపిస్తోంది.

మద్యం షాపుల్లో సీసీ కెమేరాలు

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో బిల్లులు ఇస్తున్నారు. మరోవైపు మద్యం అక్రమా లకు తావు లేకుండా సీసీ కెమేరాలు ఏర్పాటుచేశారు. అత్యధి కంగా కేసులు విక్రయిస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరిక లు జారీచేశారు. సీసీ కెమేరాలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు అను సంధానం చేశారు. ఎన్నికల సంఘం ఇన్ని విధాలుగా అప్రమత్తమైంది. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికార పార్టీకి మద్దతుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవంటూ ఎన్నికల సంఘం ఇప్పటికే సంకేతాలు పంపింది.

బరితెగిస్తున్న వలంటీర్లు

భీమవరంలో కొందరు వలంటీర్లు బరితెగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు కావడంతో వారిని విధుల నుంచి తొలగించారు. వారివద్ద మొబైల్ ఫోన్‌లో యాప్‌లు పని చేయకుండా చేశారు. అయినా కొందరు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిసున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు ఉద్యోగులు, వలంటీర్లు జాగ్రత్త వహించకపోతే చర్యలు తప్పేట్టు లేవు.

ఘనంగా దువ్వ వేణుగోపాల స్వామి రథోత్సవం



తణుకు, మార్చి 20 : తణుకు మండలం దువ్వ గ్రామంలో ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలోని పురవీధుల గుండా వేలాది భక్తులు నడుమ గోవిందనామ స్మరణలతో రథోత్సవం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గ్రామంలో స్వామివారికి పొన్నవాహన ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధికారి పిల్లి సూర్యనారాయణ తెలిపారు.

నేడు కొల్లేరు పెద్దింటమ్మ కల్యాణోత్సవం



పెద్దింటిమ్మ, గోకర్ణేశ్వరస్వామి

కైకలూరు, మార్చి 20: కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోటలో ఉన్న పెద్దింటమ్మగా పిలువబడే జలదుర్గ అమ్మవారికి కొల్లేటికోటకు రెండు కిలోమీటర్ల దూరంలోని గోకర్ణపురంలో ఉన్న గోకర్ణేశ్వరస్వామి వారికి గురువారం కల్యాణం నిర్వహిస్తారు. గోకర్ణపురం నుంచి పల్లకిలో భక్తుల కోలాహలం, మేళాతాళాల మధ్య స్వామిని ఊరేగింపుగా కొల్లేటికోటకు తీసుకువచ్చి అక్కడ అమ్మవారి సన్నిధిలో నిర్మించిన మండపంలో స్వామివారికి, అమ్మవారికి రాత్రి 12 గంటల సమయంలో కల్యాణం నిర్వహిస్తారు. తొలుత అమ్మవారికి కలువబోనాల గ్రామోత్సవం నిర్వహిస్తారు. పందిరిపల్లిగూడెం గ్రామస్థులు భారీ ప్రభతో చేరుకుంటారు. కొల్లేటికోటలో పెద్దింటమ్మవారిని పెండ్లి కుమార్తెగా, గోకర్ణేశ్వరస్వామివారిని పెండ్లి కుమారుడిగా గురువారం ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ,ప్రసాదం పంపిణీ ఆకివీడుకు చెందిన కొటికలపూడి సూర్యనారాయణ, నాగేశ్వరి దంపతులు నిర్వహించారు.

ఏసీబీ డీఎస్పీగా సుబ్బరాజు బాధ్యతలు



ఏలూరు క్రైం, మార్చి 20 :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అవినీతి నిరోధకశాఖ డీఎస్పీగా సుబ్బరాజు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1995 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన సుబ్బరాజు తూర్పు గోదావరి, కృష్ణాజిల్లాలో ఎస్ఐ, సీఐగా పనిచేసి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏసీబీ సీఐగా పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన విజయవాడ ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. అనకాపల్లి ఎస్‌డీపీవోగా పనిచేశారు. తిరిగి కొద్దినెలల కాలంలోనే ఆయన అక్కడ నుంచి బదిలీ చేసి డీజీపీ కార్యాల యానికి రిపోర్టు చేశారు. తిరిగి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా నియమితులయ్యారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అవినీతి అధికారుల సమా చారాన్ని 14400కు గాని, లేదా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీ నంబర్ 94404 46157, సీఐల సెల్ నెంబర్లు 94404 46158, 94404 46159లకు సమాచారం అందించాలన్నారు. ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో కాని కార్యాలయాల్లో కాని ప్రభుత్వానికి సంబంధించిన పనులు సజావుగా జరుగకుండా అవకతవకలు జరుగుతుంటే సమాచారం అందించవచ్చునన్నారు. ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.



రోగులతో మాట్లాడుతున్న జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యనారాయణ

వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఆకివీడు సీహెచ్‌సీని పరిశీలించిన డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ

ఆకివీడు, మార్చి 20: ముప్పయి పడకల ఆసుపత్రిలో నెలకు సాధారణ ప్రసవాలు, శస్త్ర చికిత్సలు ఒక్కటి కూడా జరగకపోవడం, ఓపీ, ఐపీలు తగ్గడంపై జిల్లా వైద్యాధి కారులు మండిపడ్డారు. దీనికి సూపరింటెండెంట్ ప్రశాంత్ అసమర్థతే కారణమన్నారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు ప్రసవాలు చేయకపోగా భీమవరం, విజయవాడ వెళ్ళమనడం క్షమించరాని నేరమన్నారు. ఆకివీడు సీహెచ్‌సీని (ప్రభుత్వాసుపత్రి) జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కీర్తిశ్రావణి బుధవారం పరిశీలించారు. ప్రసూతి వైద్య నిపుణులు ఆసుపత్రికి ఉన్నా ప్రసవాలు జరగకపోవడం పద్ధతి కాదన్నారు. సూపరింటెండెంట్ ఉదయం 9 గంటలకు సీట్‌లో కూర్చుంటే మిగిలిన వైద్యులు సక్రమంగా విధులు నిర్వహిస్తారన్నారు. రాత్రి సమయంలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది సక్రమంగా ఉండాలన్నారు. ఈ ప్రాంతం నుంచి ఆత్మహత్య కేసులు అధికంగా వస్తున్నా పోస్టుమార్టం చేసే వాళ్ళు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోగుల దగ్గర కేస్ షీట్‌లు పెట్టకుండా వైట్ పేపర్‌పై రాయడాన్ని సూపరింటెండెంట్, వైద్యులపై ఆగ్రహించారు. మత్తు డాక్టర్ లక్ష్మీనారాయణ, జనరల్ మెడిసన్ రాజేష్, ప్రసూతి వైద్య నిపుణులు భాస్కరరావు, స్టాఫ్‌నర్సు జోత్స్న ఉన్నారు.



ముసునూరులో పొగాకు పందిరిపై వేసిన బరకాలు

చిరు జల్లులతో పొగాకు రైతుల్లో ఆందోళన

ముసునూరు, మార్చి 20: వాతావరణం మార్పులు, భారీ వర్షాల హెచ్చరికతో పొగాకు రైతుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. బుధవారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. దీంతో పందిళ్ళపై ఉన్న పొగాకు పంటను రైతులు బరకాలు వేసి కప్పారు. మండల వ్యాప్తంగా సుమారు 850 ఎకరాల్లో పొగాకు పంట సాగైంది. 60 శాతం పైగా పంట రైతుల చేతికందగా 35 శాతం పందిళ్ళపై ఉంది. ఇంకా కొంత కోత కోయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నాటు పొగాకు వేసిన తరువాత రబీ సీజన్‌లో అధిక వర్షాల వల్ల ఆర్థికంగా నష్టపోయారు. మరలా వేసిన పంటను సైతం దున్ని ఇతర ప్రాంతాల నుంచి పొగాకు నారును కొనుగోలు చేసి పంట వేశారు. పంట చివరి దశలో పందిళ్ళపై ఉండగా వర్షం కురిస్తే ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పుట్టు పొగాకు రూ.30 వేలు ధర ఉందని, భారీ వర్షాలు కురిసి పంట తడిస్తే సగం ధర కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ సమాచారం మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎం.మధుమోహన్ సూచించారు. ముఖ్యంగా పొగాకు పందిళ్ళపై సాధ్యమైనంత వరకు పరదాలు వేసుకుని పొగాకు తడవకుండా కాపాడుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు తీవ్రగాయాలు

ముసునూరు, మార్చి 20: మండలంలోని వలసపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు. నూజివీడు మండలం రావిచర్ల గ్రామానికి చెందిన అన్నదమ్ములు మరీదు మోహన్‌కృష్ణ, కిరణ్ ఈ నెల 13న కామవరపుకోట మండలం వీరంపాలెంలో ఒక ఇంటికి వైరింగ్ పనులకు వెళ్లి రాత్రి బైక్‌పై వస్తుండగా వలసపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అన్నదమ్ములకు తీవ్ర గాయాలు కాగా వారిని 108లో ఏలూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై వీరి పెద్ద సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రంగులు మార్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెంటపాడు, మార్చి 20: ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మండలంలో దర్శిపర్రు, రాచర్ల గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు, రావిపాడు వెంకయ్య ఒయ్యేరు కాలువపై ఉన్న వంతెనపై వైసీపీ రంగులు ఉన్నాయంటూ ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వీటికి రంగులు మార్చి తెల్ల రంగు వేయించారు.







ఇంకా నిర్లక్ష్యమేనా ?

కోడ్ అమల్లో మీనమేషాలు

ఎన్నికల కోడ్ కూసింది నాలుగు రోజులు అవుతోంది. ప్రభుత్వ ప్రచార, సీఎం ఫొటోలు, పథకాలు, రాజకీయ నాయకుల విగ్రహాల ఇలా అన్నింటినీ మూసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. అయినా రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, కనిపిస్తూనే ఉన్నాయి.. వివిధ ప్రభుత్వ పథకాలపై జగన్ ఫొటోలు దర్శనమిస్తున్నాయి..

ఈ గ్రామానికి మినహాయింపా ?



సర్పంచ్ ఇంటిపై ఉన్న బోర్డు



గరువు వంతెనవద్ద ఉన్న జగనన్న బోర్డు

పెనుమంట్ర, మార్చి 20 :ఎన్నికల కోడ్ అమలు చేయవలసిన అధికారులు ఆ గ్రామాన్ని మినహాయించారా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. దీనికి కారణం పెనుమంట్ర గరువులో గ్రామ సర్పంచ్ ఇంటిపై ఉన్న బోర్డు తొలగించేందుకు ఉద్యోగులు సాహసించకపోవడమే.. ఇదిలా ఉంటే పెను మంట్రలో శ్రీరామ జన్మభూమి అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఏర్పాటుచేసిన కాషాయ జెండాలను సైతం తొలగించడంతో హిందూ బంధువులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మల్లిపూడి జుత్తిక గ్రామాల్లో గోడపై వేసిన జైశ్రీరామ్ నినాదాలు సైతం తొలగించారని ఈ సంఘటనపై నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నాయకులు తెలిపారు.

పాల ప్యాకెట్లపై సీఎం బొమ్మ



పాలకొల్లు, మార్చి 20 : ఎన్నికల కోడ్ కూసినప్పటికీ కొందరు అధికారులు పట్టించుకున్నట్టు కనపడడం లేదు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు ఐసీడీఎస్ ద్వారా సరఫరా చేసే పాల ప్యాకెట్లపై సీఎం జగన్ బొమ్మ ముద్రించి పంపిణీ చేస్తారు.. ఐతే ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం బొమ్మతో ఉన్నపాల ప్యాకెట్ల సరఫరా చేయడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. సంబంధిత అధికారి వివరిస్తూ ఈ పాల ప్యాకెట్లు ఎన్నికల కోడ్ రాక ముందుగా సరఫరా చేసినవని, కోడ్ వచ్చిన అనంతరం నిబంధనల మేరకు పాల ప్యాకెట్లు, చెక్కీలు వంటివి సరఫరా చేస్తామని తెలిపారు.

పోలవరంలో మండల సర్వసభ్య సమావేశం !

పోలవరం, మార్చి 20 : పోలవరం మండలంలో ఎన్నికల కోడ్‌కి విరుద్ధంగా అధికారులు బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్థానిక ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధ్యక్షత వహించి పలు సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ ప్రతినిధులతో సమావేశాలు, సమీక్షలు నిర్వహించకూడదు. నియమావళిని అతిక్రమించి సమావేశం నిర్వహించడంపై మండల ప్రజా పరిషత్ అధికారిణి జి.శ్రీనుని వివరణ కోరగా కొత్తగా విధాన పరమైన నిర్ణయాలు ఏమీ తీసుకుకోకుండా సమావేశాలు నిర్వహించుకోవచ్చునని అన్నారు. అయితే అధికార పార్టీ



ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



టి.నరసాపురం మండలంలో బిగిస్తున్న విద్యుత్ మీటర్లపై జగన్ ఫొటో, నవరత్నాల పథకం..

విద్యుత్ మీటర్లపైనా జగన్ బొమ్మ..!

టి.నరసాపురం, మార్చి 20 : టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెం గ్రామంలో వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంలో భాగంగా జగన్ ఫోటోతో పాటు నవరత్నాల పథకాలను తెలియజేసే విధంగా ఉన్న ఫోటోలు ఉన్న విద్యుత్ మీటర్లను బిగిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా ఎన్నికల కోడ్‌కు ముందే ఈ పనులు ప్రారంభమయ్యాయన్నారు. సిబ్బందిని ఏర్పాటు చేసి ఎన్నికల నియమాలను అనుసరించి వాటిని మూయించే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకం కింద మండలంలో 10 వేల మీటర్లు మంజూరైతే ఇప్పటివరకు మక్కినవారిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం తదితర గ్రామాల్లో దాదాపు 4 వేల మీటర్లు బిగించారన్నారు.

36,146 పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగింపు

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరుసిటీ, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల కోడ్ సందర్భంగా ఏలూరు జిల్లాలో రాజకీయ ప్రకటనలకు సంబంధించి ఇప్పటివరకు 36 వేల 146 పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు తొలగించినట్టు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఫొటోలతో కూడిన 1,445 వాల్ రైటింగ్స్, 8,336 పోస్టర్లు, 8,319 బ్యానర్లు, 3,488 హోర్డింగ్‌లు, జెండాలు వంటివి మొత్తం 21 వేల 581 తొలగించారన్నారు. ప్రైవేటు ప్రదేశాల్లో ఉన్న 1259 వాల్ రైటింగ్స్, 5824 పోస్టర్లు, 4875 బ్యానర్లు, 2570 హోర్డింగ్‌లు , జెండాలు వంటివి మొత్తం 14 వేల 558 తొలగించారన్నారు.

రొయ్యధర ఢమాల్ !

ఆక్వా ట్రేడర్స్ మాయాజాలం

15 రోజులలో రూ.40 తగ్గింపు

నష్టాలు పాలైన రైతులు

పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ఆకివీడు రూరల్ మార్చి 20 : రొయ్య ధరలు పడిపోవడంతో ఆక్వా రైతులు మరోమారు నష్టాల పాలయ్యారు. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉంటే ఇదే అదనుగా ట్రేడర్స్ సిండికేట్‌గా మారి ధరలను తగ్గించడంతో పాటు ఉత్పత్తులను కొనుగోలు చెయ్యడానికి ఆసక్తి చూపించకపోవడంతో రైతులు ఒక్కసారిగా నష్టాల పాలవుతున్నారు. ట్రేడర్స్ సిండికేట్‌గా మారి రొయ్యలు ఉత్పత్తి తక్కు వగా ఉన్నప్పటికి ధరలు అమాంతం తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆక్వా సాగులో ప్రధానంగా డిసెంబరు నుంచి జూన్ మధ్య కాలాన్ని గోల్డెన్ సమయంగా భావిస్తారు. ఈ సమ యంలో సాగు చేస్తే నష్టాలు రావని రైతుల నమ్మకం. గతంలో 100 కౌంటు నుంచి 90 కౌంటుకు మధ్య 20 రూపాయలే తేడా ఉండేదని ప్రస్తుతం 70 కౌంటు వరకు కేవలం రూ.10 మాత్రమే వేరి యేషన్ చూపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుకు ఉందని రైతులు సంప్రదిస్తే తమ వద్దే సరుకు ఉందని బెట్టు చేస్తున్నారు. రైతులు బతిమాలాడుతుంటే తక్కువ ధర కోట్ చేసి మోసం చేస్తున్నారని వాపోతున్నారు.

	15 రోజుల క్రితం	ప్రస్తుతం
100 కౌంటు	రూ.240	రూ.200
90 కౌంటు	రూ.250	రూ. 210
80 కౌంటు	రూ.270	రూ. 220
60 కౌంటు	రూ.320	రూ. 270
40 కౌంటు	రూ.420	రూ. 340
30 కౌంటు	రూ.490	రూ. 450



రైతులను దోచేస్తున్న ట్రేడర్స్



ఎన్నికల హడావుడిలో అధికార యంత్రాంగం తలమునకలై ఉండగా ఇదే అదనుగా ట్రేడర్స్ ఆక్వా రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ధరలను అమాంతం తగ్గించేసి సరుకు కొనుగోలు చేయకుండా నష్టాలపాలు చేస్తున్నారు. కేవలం పదిరోజులలో ధరలు అమాంతం తగ్గిపోయాయంటే వ్యాపారస్తులు మాయాజాలమే. అధికారులు రైతులను ఆదుకోవాలి.

-పిల్లా బాబులు, ఆక్వారైతు మాదివాడ

సిండికేట్ అయిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



రైతులు నష్టాలబాట పడుతున్నారంటే వ్యాపారస్తులే కారణం. సీడ్, ఫీడ్ అమ్మేవారే కాదు.. కొనుగోలు చేసేవారు సిండికేట్‌గా మారి ఆక్వా రైతులను నష్టాల పాలు చేస్తున్నారు. వ్యాపారస్తులపై ప్రభుత్వ యంత్రాంగం సరియైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు దోచేస్తు న్నారు. సిండికేట్ అయి ధరలు తగ్గించిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

-భూపతిరాజు తిమ్మరాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్రైం కార్నర్

వివాహేతర సంబంధం అనుమానంతో గొడ్డలితో దాడి



తీవ్రంగా గాయపడిన కృష్ణ

వేలేరుపాడు, మార్చి 20 : వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి గొడ్డలితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వేలేరుపాడు మండలం కొత్తూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. వేలేరుపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇంటికి పక్క గ్రామమైన తూర్పుమెట్ట గ్రామానికి చెందిన చిచ్చడి కృష్ణ అనే వ్యక్తి తరచుగా వస్తూ ఉండేవాడు. తన భార్యతో కృష్ణకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానం ఆ వ్యక్తికి కలిగింది.ఈ క్రమంలో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో కొత్తూరు వచ్చి వెళుతున్న కృష్ణపై గొడ్డలితో దాడి చేశాడు. తలపై తీవ్ర గాయం అవ్వడంతో స్థానికులు కృష్ణను వేలేరుపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టుగా ఎస్ఐ తెలిపారు.కృష్ణ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఫ్లెక్సీ పెడుతుండగా విద్యుత్ షాక్.. యువకుడు మృతి



సాలా కృష్ణ(ఫైల్)

పాలకొల్లు రూరల్, మార్చి 20 : మండలంలోని లంకలకోడేరు గ్రామంలో మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై సాలా కృష్ణ (21) అనే యువకుడు మరణించినట్టు పాలకొల్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ రాంబాబు తెలిపారు. కృష్ణ తన మిత్రుడు టీస్టాల్ పెట్టుకుంటున్న నేపథ్యంలో అక్కడ ఫ్లెక్సీ పెడుతుండగా ఫ్లెక్సీ రాడ్లు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ కొట్టడంతో అక్కడి కక్కడే మరణించాడు. మరో యువకుడు అరుణ్ కుమార్‌కు స్వల్ప గాయా లవడంతో పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు మృతుడు కృష్ణ సోదరుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుని మృతి



మృతి చెందిన రమేష్.. చికిత్స పొందుతున్న చిన్నారి



ఏలూరు క్రైం, మార్చి 20 :కూలి పనుల కోసం తుని వెళ్ళి తిరిగి తన స్వగ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా జాతీయ రహ దారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఒక యువకుడు అక్కడి కక్కడే మృతి చెందాడు. పల్నాడు జిల్లా చవలపురం మండలం వెలమావారి పాలేనికి చెందిన ఉయ్యాల రమేష్ (28) కూలిపనుల నిమిత్తం కొంతకాలం క్రితం తుని వెళ్లాడు. బుధవారం ఉదయం మోటారు సైకిల్‌పై తన భార్య, కుమార్తెతో కలిసి స్వగ్రామానికి వెళ తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య, కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సమాచారం ఏలూరు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, మార్చి 20 : ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై మృతి చెందాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. కృష్ణా జిల్లా తేలప్రోలుకు చెందిన మంగదుడ్డి సుధాకర్‌కు భార్య రజని, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను తేలప్రోలు రైల్వేస్టేషన్ రైల్వే గేటు వద్ద రైలు ప్రమాదంలో మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యా భర్తల మధ్య గొడవ.. భార్య ఆత్మహత్య

భీమవరం క్రైం, మార్చి 20 : భార్యభర్తల మధ్య తగాదాల కారణంగా మనస్థాపానికి గురైన ఒక మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపిన వివరాలు ప్రకారం నర్సయ్య అగ్రహారానికి చెందిన కలిగి శ్రీలత (26)కు అదే ప్రాంతానికి చెందిన తాపీ మేస్త్రీ రమేష్‌తో 2016లో ప్రేమ వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. బుధవారం రమేష్ పని నుంచి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య శ్రీలత సమీపంలోని పుట్టింటికి వెళ్లడంతో అక్కడకు వెళ్లి ఇంటికి తీసుకు వచ్చాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో బంధువులు ఇంటికి చేరుకున్నారు. వారిద్దరికి సర్దిచెప్పారు.అనంతరం రమేష్ బెడ్‌రూమ్‌లో ఉండగా శ్రీలత వంటింట్లోకి వెళ్లి ఇనప గడ్డర్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో రమేష్ వెళ్ళి చూసేసరికి ఆమె వేలాడుతూ కనిపించింది. కిందకు దించి ఆసుపత్రికి తీసుకువెళ్ళగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి మహాలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి..కేసు నమోదు

భీమవరం క్రైం, మార్చి 20 : విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఒక వ్యక్తి దాడి చేసినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారని టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం అంబేద్కర్ సెంటర్‌లో విజయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్న సమయంలో దీప్‌సాయి అనే వ్యక్తి మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై ట్రాఫిక్ ఉల్లంఘన చేశాడు. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ వారిని కేక వేశాడు. కొంత దూరం వెళ్లి వెనక్కి వచ్చి దీప్‌సాయి ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. దీనిపై విజయ్‌కుమార్ పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఉండి, మార్చి 20 : మైనర్ బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. ఉండి మండలం ఉణుదుర్రు గ్రామానికి చెందిన మాండ్రు జయరాజుకు బంధువైన మైనర్ బాలికను యండగండి గ్రామానికి చెందిన ఓగిరాల చంటి అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానంటూ వెంటపడి వేధిస్తున్నాడు. పెళ్లికి ఒప్పుకోకపోతే చంపుతానని బెదిరిస్తున్నట్లు బాలిక జయరాజుకు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

వైసీపీ నాయకుడి కార్యాలయంలోనే పేకాట

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 20: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడే స్వయంగా పేకాట కేంద్రం నిర్వహిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వైసీపీ నాయకుడు, రైతు సలహా కమిటీ జిల్లా అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు తాడేపల్లిగూడెం వార్పురోడ్డులోని తన కార్యాలయంలో కొంత మందితో కలిసి పేకాట ఆడుతున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో పట్టణ ఎస్ఐ సుధాకరరెడ్డి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి చేశారు. శ్రీనివాసరావుతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.14,130 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.



మాటల్లో పెట్టి కొట్టేస్తారు !

తస్మాత్.. జాగ్రత్త.. నరసాపురంలో సెల్ ఫోన్ల చోరీ

- నరసాపురం మునిసిపాల్టీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న చిత్రసేన్ బుధవారం విధులకు హాజరవుతుండగా నడుచుకుంటూ ఇద్దరు వచ్చారు. తమ పిల్లవాడు రాత్రి రుస్తుంబాద జాతరకు వెళ్లి ఇంటికి రాలేదని ఒకసారి ఫోన్ ఇస్తారా అని అడిగారు. చిత్రసేన్ ఫోన్ ఇవ్వగానే ఇద్దరూ ఒక్కసారిగా ఉడాయించారు. కేకలు వేసి వారిని పట్టుకునే ప్రయత్నం చేసేలోపు వీధి సందుల గుండా పారిపోయారు. చిత్రసేన్ వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- గత నెలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడు మునిసిపల్ కార్యాలయం నుంచి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చి ఒకడు భుజం తట్టాడు. వెనుక తిరిగి చూసేసరికి కంట్లో ఇసుక కొట్టిపై జేబులోని ఫోన్ తీసుకుని పారిపోయాడు.
- ఆర్టీసీ బస్టాండ్ దగ్గర చినమామిడిపల్లికి చెందిన వ్యక్తి బస్సు ఎక్కుతుండగా కింద రూ.20 పడ్డాయని చెప్పాడు. అతను ఒంగి డబ్బులు తీసుకునే లోపు ముందు జేబులోంచి ఫోన్ తీసుకుని పారిపోయాడు.

నరసాపురం, మార్చి 20 : ఇలా చెప్పుకుంటూ పోతే నరసాపురం పట్టణంలో ఇటీవల అనేక ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఒక ముఠా ఫోన్లనే టార్గెట్ చేస్తూ చోరీలు చేస్తున్నది. ప్రధానంగా ఫోన్లు చూస్తూ నడుచుకుంటూ వెళ్లేవారు.. ముందు జేబులో పెట్టుకుని నడిచే వారు.. బ్యాగుల్లో పెట్టుకుంటూ బస్సు ఎక్కే ప్రయాణికుల నుంచి కొట్టేస్తున్నారు. కొత్త ఫోన్లు, ఖరీదైనవైతే వెంటనే బాధితులు పోలీసుల్ని ఆశ్రయిస్తున్నారు. లేకపోతే బయటకు చెప్పితే ఎక్కడ పరువుపోతుందోనని వదిలేస్తున్నారు. దీన్నే దొంగలు తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. గతంలో పట్టణంలో చైన్ దొంగతనాలు జరిగేవి. గతేడాది పదికి పైనే జరిగాయి. తాజాగా సెల్‌ఫోన్ల చోరీలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. మరోవైపు పట్టణంలో సీసీ కెమెరాలు చాలా వరకు పని చేయడం లేదు. ఎక్కడైతే కెమెరాలు పని చేయడం లేదో ఆ ప్రాంతంలోనే చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిపై పోలీసులు మాత్రం నిఘా పెట్టి త్వరలో పట్టుకుంటామని చెప్పడం గమనార్హం.


అడవికొలనులో పర్యటిస్తున్న పత్సమట్ల ధర్మరాజు, గన్ని వీరాంజనేయులు

అడవికొలనులో ఇంటింటికి జనసేన

నిడమర్రు, మార్చి 20: ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజుకు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. నిడమర్రు మండలం అడవికొలనులో పత్సమట్ల ధర్మరాజు టీడీపీ, జనసేన కార్యకర్తలతో కలసి బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఎన్నికలలో గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధికి కృషిచేసే నూతన ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ సహా 40 మంది జనసేనలో చేరిక

గణపవరం, మార్చి 20: వైసీపీ పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని, ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ద్వారా సుపరిపాలన అందుతుందని నియోజకవర్గ జనసేన ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సీహెచ్ అగ్రహారంలో జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన సర్పంచ్ చుక్కా అప్పారావు, ఉపసర్పంచ్ బొల్లాం దుర్గారావు, మరో 40 మంది కార్యకర్తలు బుధవారం జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణంరాజు, తోట శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గుడ్ల వీర్రాజు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు రక్త మార్పిడి


చిన్నారులకు రక్తమార్పిడి చేస్తున్న సిబ్బంది

ఏలూరు క్రైం, మార్చి 20: తలసేమియా బాధిత చిన్నారులకు ప్రభుత్వాసుపత్రి రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో రక్తమార్పిడి చేస్తున్నామని ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం 12 మంది చిన్నారులకు రక్తమార్పిడి చేశామని, ప్రతినెల క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకమైన ఫిల్టర్ సెట్లు ద్వారా రక్తమార్పిడి చేస్తున్నామని, మందులు కూడా అందిస్తున్నామన్నారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు పీఏఆర్ఎస్ శ్రీనివాస్, కెబి సీతారామ్, కడియాల కృష్ణారెడ్డి పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ పక్షోత్సవాలు

ఏలూరు రూరల్, మార్చి 20: శనివారపుపేట అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ పక్షోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి మాట్లాడుతూ గర్భిణులకు సంబంధించి పౌష్టికాహారం ప్రాధాన్యం వివరించారు. డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ పిల్లలు ఎదుగుదలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ బి.మంగ, ఏఎన్ఎం శ్రీదేవి, ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.మార్తమ్మ, ఎం.అన్నపూర్ణ, నాగమణి, సత్యవతి, మహిళా కార్యదర్శి కె.కావ్య తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో శోభాయాత్రను నిర్వహిస్తున్న మహిళలు

రెడ్డిగణపవరంలో 108 కలశాలతో శోభాయాత్ర

బుట్టాయగూడెం, మార్చి 20: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం మహిళలు 108 కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అఖండ దీపారాధన, అమ్మవారి యంత్రాలకు క్షీరాదివాసం, తదితర పూజాది కార్యక్రమాలను భక్తులు జరిపించారు. అమ్మవారి పూజా కార్యక్రమాలు గరిమెళ్ళ వెంకటరమణ సిద్ధాంతి పర్యవేక్షణలో జరిగినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ భౌమరాజు సత్యనారాయణరాజు, ధర్మకర్త ధనుంజయరాజు తెలిపారు. ఈ నెల 24న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు.

జీలుగుమిల్లిలో జగదాంబ ఊరేగింపు



జీలుగుమిల్లి, మార్చి 20: గ్రామ ఇలవేల్పు జగదాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఊరేగింపు ఘనంగా జరిగింది. విచిత్ర వేషధారణ, గరగ నృత్యాలతో గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగించారు. ఆలయం వద్ద అన్న సమారాధనలో తెల్లం రాజ్యలక్ష్మి, బోదా శ్రీనివాసరెడ్డి, కక్కిరాల రాము, కొప్పుల నాగరాజు, చక్రి, చాట్రాతి భవాని, చిట్టిబొమ్మ శ్రీను, కుసుమ వెంకట్, గంగుల రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 20: దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని అగ్రహారంలో జగన్నాథస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వంగల పవనకుమార్, వెంకటాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు, సిబ్బంది, కృష్ణ భక్తులకు సేవలందించారు. 23న ఎదుర్కోలు సన్నాహం, స్వామివార్ల కళ్యాణ మహోత్సవం, 24న రథోత్సవం, 25న పూర్ణాహుతి, 26న పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

నేటి నుంచి బాబా మందిర పంచమ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 20: ఆదివారపుపేట షిరిడీ సాయి ప్రేమ మందిర్ పంచమ వార్షికోత్సవం ఈనెల 21 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్టు ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు తెలిపారు. 21న నిత్య పూజలతోపాటు గురు చరిత్ర, సాయి సత్చరిత్ర పారాయణం జరుగుతుందన్నారు.

ఆడమిల్లిలో దుర్గమ్మ తిరునాళ్లు ప్రారంభం

కామవరపుకోట, మార్చి 20: ఆడమిల్లి శనీశ్వరాలయ ప్రాంగణంలో కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మహాసంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య మండపారాధన, దీక్షాధారణ, గోపూజ, అఖండ దీపారాధన, ప్రధాన కలశ వాహనం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

వీరంపాలెంలో కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న తపనా చౌదరి

కామవరపుకోట, మార్చి 20: సాగిపాడు పంచాయతీ వీరంపాలెంలో నిర్మితమైన ఆలయంలో బుధవారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయచౌదరి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దుర్గమ్మ తిరునాళ్లు

కామవరపుకోట, మార్చి 20: రావికంపాడు పంచాయతీ వెంకటాపురం కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త కోటగిరి విశ్వనాథం తెలిపారు. ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు విశ్వనాథం తెలిపారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

పెదవేగి, మార్చి 20: కవ్వగుంటలో రామాలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. విశాఖపట్నానికి చెందిన వేదపండితుడు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఛైర్మన్ బెనర్జీ, రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో చింతమనేని ప్రభాకర్


ఏలూరులో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు


కె.కోటలో మాట్లాడుతున్న గోరుముచ్చు గోపాల్ యాదవ్


వేగవరంలో రోషన్‌కుమార్‌కు మహిళల హారతి

యువత వలస

రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు దెబ్బతీసిన వైసీపీ

జగన్ పాలనపై చింతమనేని ధ్వజం

పెదవేగి, మార్చి 20: రాష్ట్ర భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దేశమంతా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతుంటే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీసిందన్నారు. వట్లూరుకు చెందిన పలువురు యువకులు బుధవారం టీడీపీలో చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ఉపాధి అవకా శాలు సన్నగిల్లడంతో యువత ఇతర రాష్ట్రాలకు వలసపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుపడాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రభాకర్ అన్నారు. వట్లూరుకు చెందిన సంజయ్ బాబీ, నూతలపాటి నవీన్‌రాజు, ముళ్ళపూడి సాంబశివరావు, భీమరాజు, దయాకర్, ప్రభుదాస్, తదితరుల ఆధ్వర్యంలో 50మంది చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి చింతమనేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత ఆలోచనా విధానాలకు అనుగుణంగా రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందాలంటే కూటమి విజయం సాధించాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి, యువత భవిష్యత్ బాగుపడుతాయని ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో యూఎస్. రామ్‌ప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, బొప్పన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తీరుతో విసిగిపోయారు..

ఏలూరు టూటౌన్: వైసీపీ తీరుతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విసుగు చెందారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 8వ డివిజన్‌లోని మాజీ కౌన్సిలర్ టీఎస్.స్వామి తన అనుచరులతో బుధవారం టీడీపీలో చేరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో చంటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. చంటి మాట్లాడుతూ వైసీపీలో ఇబ్బందులు పడుతున్న నాయకులు, కార్యకర్తలంతా టీడీపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 11వ డివిజన్‌లో వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి చోడే కిట్టూ తన అనుచరులతో చోడే బాలు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా బడేటి చంటి బుధవారం 23, 24 డివిజన్లలో పర్యటించారు. జగన్ పాలన అంతమొందే రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధే ఏలూరు నియోజకవర్గంలో కనిపిస్తుందన్నారు. గత ఐదేళ్లలో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటములు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గూడవల్లి వాసు, విజయలక్ష్మి, మాణిక్యాలరావు, భీమవరపు సురేష్, ఎస్.రమేష్, చేకూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రానుంది

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం రానుందని, చంద్రబాబు ఆధ్వర్యంలో ఐదేళ్లుగా వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళతారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. వేగవరంలో పర్యటించిన రోషన్‌కు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం రోషన్‌కుమార్ గ్రామంలో పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకుని రానున్నది మంచి కాలమని, అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. శాయిల సత్యనారాయణ, ఆలపాటి రాము, కుక్కల మాధవ, ఆకుల రాకేష్, మోటేపల్లి బసవరాజు, దూదిపాల వెంకటరమణ, పెనుమర్తి రాంకుమార్, బొబ్బర రాజ్ పాల్ కుమార్, పాతూరి అంబేడ్కర్, పగడం సౌభాగ్యవతి, చెరుకూరి శ్రీధర్, చిలపరెడ్డి ఇంద్రాణి, రావూరి కృష్ణ, తూటికుంట రాము, కొండ్రెడ్డి కిషోర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ఉంటా : గోపాల్ యాదవ్

కామవరపుకోట: ప్రజలకు చేరువలో ఉంటూ నిరంతరం సేవలందించి పార్టీ ప్రతిష్ఠ పెంచుతానని టీడీపీ నేత గోరుముచ్చు గోపాల్ యాదవ్ అన్నారు. టీడీపీ శ్రేణులు, జనసేన నాయకులు, వీర మహిళల సమక్షంలో బుధవారం గోపాల్‌యాదవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి పాటుపడుతూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు చేయూతనిస్తానని చెప్పారు. రానున్న కాలంలో ఏలూరు పార్లమెంటు పరిధిలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కంఠమనేని సత్యనారాయణ, బేతిన వెంకట్రావు, గోరింక దాసు, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కంఠమనేని అంజిమూర్తి, పర్సా శ్రీను, ఆకుమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు. జనసేన అధ్యక్షుడు షేక్ వల్లీ, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సూర్యతేజ

బుట్టాయగూడెం, మార్చి 20: ఎన్నికల నియమావళి పాటించాలని అధికారులకు ఐటీడీఏ పీవో, ఆర్వో ఎం.సూర్యతేజ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందితో బుధవారం సమావేశం జరిగింది. ఎన్నికల సిబ్బందికి ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఎస్‌డీసీ శ్రీనివాసులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పక్షాలు సహకరించాలి : ఆర్డీవో ఖాజావలి

ఉంగుటూరు: రానున్న ఎన్నికలలో అన్ని వర్గాల రాజకీయ పక్షాలు ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా వ్యవహరించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో బాధ్యతతో వ్యవహరించాలని ఆర్డీవో, ఆర్వో ఖాజావలి అన్నారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలను ఎన్నికల సిబ్బందికి వివరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలి

లింగపాలెం: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్, సివిల్ సప్లై డీటీ జరీనా ఆధ్వర్యంలో రేషన్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రేషన్ డీలర్లు ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలు చేయాలని, పేదలకు బియ్యం పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేషన్ దుకాణాల్లో వివిధ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. పేదలకు అందించే బియ్యం సక్రమంగా అందించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వారితో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలంలో నిర్మాణం తొలగింపు


మెటీరియల్‌ను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు రూరల్, మార్చి 20: తంగెళ్ళమూడి, కంద్రికగూడెం సచివాలయం పక్కన మున్సిపల్ స్థలంలో షాపు నిర్మాణంపై అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన మున్సిపల్ అధికారులు షాపు నిర్మాణం తొలగించారు. నాలుగురోజుల క్రితం ఒక ప్రజాప్రతినిధి అండతో మున్సిపాలిటీకి సంబంధించి అని హెచ్చరిక బోర్డులున్నా నిర్మాణం తలపెట్టాడు. ఐరన్‌రేకులు, గ్రిల్స్ ఏర్పాటు చేశాడు. స్థానికులు అడ్డుకుంటే వారిని బెదిరించాడు. అధికారులు షాపు నిర్మాణ సామగ్రిని తొలగించి ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

పేకాట శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 20: పోణంగి రోడ్డులో రాజరాజేశ్వరి నగర్‌లో పేకాడుతున్నట్లు బుధవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. ఏలూరు రూరల్ ఎస్ఐ కె రాజారెడ్డి తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురుని అరెస్టు చేసి వారి నుంచి 13200 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

ఏలూరు క్రైం, మార్చి 20: శ్రీపర్రులో మద్యం కల్గి ఉన్న వ్యక్తిని ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి బుధవారం రాత్రి అరెస్టు చేశారు. అదే గ్రామానికి చెందిన మండల నాగ సూర్య చంద్ర కళారాజు ఎనిమిది బీరు బాటిల్స్ నాలుగు బ్రాందీ బాటిల్స్ కల్గి ఉన్నాడు. దీంతో అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి.

ఏలూరు టూటౌన్, మార్చి 20: నాయీ బ్రహ్మణ సమాజానికి గుంటుపల్లి నాగేశ్వరరావు చేసిన సేవలు మరువలేనివని నాయీ బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.నందీశ్వరరావు అన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమాన్‌నగర్‌లో టీడీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కే.రాజు, నగర అధ్యక్షులు పరిటాల వీరాస్వామి, లంకా వెంకటేశ్వర్లు, డీ.షన్ముకం, నరేంద్ర, రాము, కిషోర్, ప్రసాద్, రామేశ్వరరావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలి ప్రసాద్ సంతాప సభ

ఏలూరు టూటౌన్, మార్చి 20: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్ సంతాప సభ గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరుగుతుంది. ఈ నెల 9న పాలిప్రసాద్ మరణించిన విషయం తెలిసిందే. పార్టీ కార్యాలయంలో సంతాప సభను జరుగుతుందని టీడీపీ నేతలు తెలిపారు.

స్నేహితుడికి అమరవరం విద్యార్థుల సాయం



బాలుడికి సహాయం అందజేస్తున్న విద్యార్థులు

కుక్కునూరు, మార్చి 20: తోటి విద్యార్థికి సహాయం అందించి అమరవరం పాఠశాల విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. గంపెనపల్లి గ్రామానికి చెందిన వేముల శివాజీ రెండు నెలల క్రితం తలకు దెబ్బ తగలడంతో రక్తం గడ్డ కట్టింది. ఆపరేషన్ చేయాలని డాక్టర్లు తెలిపారు. పేద కుటుంబం కావడంతో శివాజీ తోటి మిత్రులను సాయం కోరాడు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలసి రూ.16వేలు సేకరించారు. పాఠశాల హెచ్ఎం ఎంవి సత్యనారాయణ ద్వారా బాధిత విద్యార్థికి అందించారు.

పర్యావరణంలో భాగమైన పిచ్చుకలను రక్షించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

జంగారెడ్డిగూడెం, మార్చి 20: పర్యావరణ పరిరక్షణలో భాగంగా పిచ్చుకలను కాపాడాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అన్నారు. సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జువాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. పిచ్చుక జాతి అంతరించిపోతుందని, వాటి పరిరక్షించుకోవాలన్నారు. జువాలజీ అధ్యాపకురాలు ఆర్.విజయ దీపిక మాట్లాడుతూ ఎక్కువ రేడియేషన్‌తో పిచ్చుకలు అంతరించిపోతున్నాయని, రేడియేషన్ తగ్గించడం వల్ల వాటిని కాపాడుకోవచ్చన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఎం.మధు, మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ అధినేత సిహెచ్ బద్రీ నారాయణ, బోటనీ డిపార్ట్మెంట్ అధినేత టి.ఝాన్సీ రాణి, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధినేత సిహెచ్ వెంకటలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి

నేడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఏలూరు రూరల్, మార్చి 20: భగత్‌సింగ్ విద్యార్థులకు స్ఫూర్తి అని పలవురు అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నగరంలో పలుచోట్ల వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. భగత్‌సింగ్‌రాజ్ గురు సుఖదేవ్ విప్లవవీరులు మాత్రమే కాదు మంచి స్నేహితులని, ఎంచుకున్న గమ్యంవైపు గతి తప్పకుండా వెళ్లారన్నారు. స్నేహానికి కులం, మతం, జాతి అడం కాదని చాటిచెప్పిన ముగ్గురి స్నేహం నేటి యువకులకు స్ఫూర్తిదాయకం అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 23న వేషధారణ, చిత్రలేఖనం, భగత్‌సింగ్‌పై పాటల కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వి.ఠాగూర్, సీహెచ్.రాజేశ్వరి, పూజ జానకేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ఏలూరులో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు, పోలీసులు

ఏలూరులో సాయుధ బలగాల కవాతు

ఏలూరు క్రైం, మార్చి 20: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని టూటౌన్ ప్రాంతంలోని తంగెళ్ళమూడి, చోడిదిబ్బ, కొత్తపేటలోని అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో పోలీసులు, సాయుధ బలగాలు బుధవారం కవాతు నిర్వహించారు. టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించి స్థానికులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నియమావళి అమలులో ఉందని, మత పరమైన అంశాలతో రాజకీయ ప్రసంగాలు ఉండరాదని, ప్రజలు వారికి నచ్చిన పార్టీపై అభిమానంతో ఎదుటి పార్టీలను విమర్శించరాదన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎక్కువ మొత్తం సొమ్ము వెంట తీసుకెళ్లరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని సీఐ ప్రభాకర్ కోరారు.

వినియోగదారుల కమిషన్ జిల్లా ఛైర్మన్‌గా నోచర్ల


జిల్లా సభ్యుల నియామక పత్రాలు అందజేత

నిడమర్రు, మార్చి 20 : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మిన్ వైస్ ఛైర్మన్‌గా నోచర్ల శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా సంకు నాగ శేషు నియమితులయ్యారు. జిల్లా ఛైర్మన్ లింగపల్లి నాగమణికంఠ బుధవారం నియామక పత్రాలు అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా అడ్మిన్ వైస్ ఛైర్మన్ నోచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వినియోగదారుడికి అందుబాటులో ఉండేవిధంగా జిల్లా నలుమూలాల కమిటీలను ఏర్పాటుచేస్తామన్నారు. నూతన వైస్ ఛైర్మన్ సంకు నాగేశు మాట్లాడుతూ వినియోగదారుడికి న్యాయం జరిగేటట్లు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్. అప్పారావు, కె.భార్గవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

23న ఘంటసాల నాటకం

ఏలూరు కల్చరల్, మార్చి 20: వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఈనెల 23న స్టేషన్ ఘన్‌పూర్, శ్రీసాయిసంతోషి నాట్యమండలి సురభి కళాకారులు ఘంటసాల నాటకం ప్రదర్శిస్తారని వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వైసోమలింగేశ్వరరావు, కేవీ.సత్యనారాయణ బుధవారం తెలిపారు. మధుర గాయకుడు, సినీ సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత విశేషాలపై నాటిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు 30మంది కళాకారులు ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తారని వారు తెలిపారు. ప్రేక్షకులు విజయవంతం చేయాలని కె.బి వెంకటరమేష్, మజ్జి కాంతారావు కోరారు.

ఉర్దూ పాఠశాలలో మానవత వంట షెడ్

జంగారెడ్డిగూడెం, మార్చి 20 : పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉర్దూ స్కూల్లో మానవత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంటషెడ్‌ను బుధవారం సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ మహంకాళి రంగ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో మానవత గౌరవ డైరెక్టర్ పెదవీర్రాజురెడ్డి, మండల ఛైర్మన్ ఆకుల ధర్మరాజు, మానవత ప్రెసిడెంట్ దల్లి కేదారేశ్వర రెడ్డి, సెక్రటరీ గద్దె సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ త్రిపుర సుందరి, ఎలికే తాతారావు, గంధం గోపాలకృష్ణ, పెనుమర్తి సురేష్, దారా సురేష్ గుప్తా, కుమార్ రాజా, బేతా రమేష్, టిప్‌టాప్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

టి.నరసాపురం, మార్చి 20: గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నిర్వాహకుడు నాగరాజు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీలోని తిరుపతిపాడులో ఆఫ్రో సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు గుడ్ సమారిటన్ కేన్సర్ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరంను బుధవారం నిర్వహించారు. వినీల్, చందు వైద్య బృందం 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ద్వారకాతిరుమల, మార్చి 20: మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సెయింట్ జేవియర్ పాఠశాల సమీపంలో బుధవారం టీడీపీ నాయకుడు మల్లిపెద్ది వెంకటేశ్వరరావు ప్రారంభించారు. టీడీపీ జనసేన సహకారంతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని బుధవారం 8 జట్లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తులసి, నరేష్, బాలకోటి తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు అందిస్తామన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ

జీలుగుమిల్లి, మార్చి 20 : విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా రాజ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏలూరులో ఏఈగా పనిచేసిని ఆయన ప్రమోషన్‌పై జీలుగుమిల్లి బదిలీ అయ్యారు. మన్యం ప్రాంతంలో రైతులకు విద్యుత్ వినియోగదారులకు తమశాఖ నుంచి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కైకరంలో పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఉంగుటూరు, మార్చి 20: కైకరంలో పెద్దింటమ్మ వార్షిక ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజున అమ్మవారికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ఉంగుటూరు ఆయుర్వేద వైద్యాధికారిగా కస్తూరి

ఉంగుటూరు, మార్చి 20: ఆయుర్వేద వైద్యాధికారిగా కస్తూరి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డాక్టర్ లక్ష్మీ సౌజన్య బదిలీ కావడంతో ఆమె స్థానంలో డాక్టర్ కస్తూరి నియమితులయ్యారు.

పది పరీక్షలకు భద్రత కట్టుదిట్టం : ఎస్పీ


ఏలూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, మార్చి 20 : జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. వన్‌టౌన్ ప్రాంతంలోని కస్తూరిబా బాలికల హైస్కూలు, శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూలు, ప్రభుత్వ బాలికల హైస్కూలును సందర్శించారు. అక్కడ మౌలిక సదుపాయాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు బందోబస్తు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లను మూయించి వేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

- ఏలూరు రూరల్: జిల్లాలో బుధవారం పది పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈవో అబ్రహం తెలిపారు. 24,067 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 23,374మంది విద్యార్థులు హాజరు కాగా 693మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. 97.12శాతం హాజరైనట్లు తెలిపారు. ప్రైవేట్ (ఒన్స్ ఫెయిల్డ్) 1135 మంది విద్యార్థులకు గాను 325మంది విద్యార్థులు హాజరు కాగా 810 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు.
- పెదవేగి: పదో తరగతి పరీక్షలు మూడోరోజు ప్రశాంతంగా ముగిసింది. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు మొత్తం 20 ఉండగా, ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఆరు కేంద్రాల్లో 912 మంది మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 825 మంది హాజరయ్యారని ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. ఆరు కేంద్రాల్లో కలిపి 87మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. మొత్తంగా మూడోరోజు పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ఠ బందోబస్తుతోపాటు విద్యార్థుల సౌకర్యార్థం తాగునీరు, ప్రథమ చికిత్సా సదుపాయం కల్పించామని ఎంఈవో వివరించారు.
- పోలవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 98 మంది, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 262 మందికి 256 మంది, కార్మెల్ పురం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 24 మందికి ఐదుగురు కంపార్ట్‌మెంట్ విద్యార్థులు హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.
- ఉంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. 714 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 690 హాజరయ్యారని ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులు మొత్తం 742 మందికి 694 మంది హాజరయ్యారన్నారు.




పెద్దింటమ్మ, గోకర్ణేశ్వర స్వామి వారు

నేడు పెద్దింటమ్మ కల్యాణం

పందిరిపల్లిగూడెం నుంచి ప్రభను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు

కైకలూరు, మార్చి 20: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి కల్యాణం గురువారం నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లను చేస్తున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోటలో వేంచేసియున్న పెద్దింటమ్మగా పిలువబడే జలదుర్గ అమ్మవారికి కొల్లేటికోటకు రెండు కిలోమీటర్ల దూరంలోని గోకర్ణపురంలో వేంచేసియున్న గోకర్ణేశ్వరస్వామి వారికి కల్యాణం నిర్వహిస్తారు. గోకర్ణపురం నుంచి పల్లకిలో భక్తుల కోలాహలం, మేళతాళాల మధ్య స్వామిని ఊరేగింపుగా కొల్లేటికోటకు తీసుకువచ్చి అక్కడ అమ్మవారి సన్నిధిలో నిర్మించిన మండపంలో స్వామివారికి, అమ్మవారికి కల్యాణం రాత్రి 12 గంటల సమయంలో నిర్వహిస్తారు. కల్యాణోత్సవానికి తొలుత అమ్మవారికి కలువబోనాల గ్రామోత్సవం నిర్వహిస్తారు. పందిరిపల్లిగూడెం గ్రామస్థులు భారీ ప్రభతో వేలాది మంది భక్తులతో కలసి చేరుకుంటారు. కొల్లేటికోటలో పెద్దింటమ్మవారిని పెండ్లికుమార్తెగా గోకర్ణపురంలో గోకర్ణేశ్వర స్వామివారిని పెండ్లికుమారుడిగా గురువారం ముస్తాబు చేశారు. ఈ కల్యాణోత్సవానికి ఆలయాన్ని విద్యుద్దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి విశేష పూజలను నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాదం పంపిణీ ఆకివీడుకు చెందిన కొటికలపూడి వెంకట సూర్యనారాయణ, నాగేశ్వరి దంపతులు నిర్వహించారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

పెద్దింటమ్మ కల్యాణోత్సవాలకు ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. జల్లు స్నానాలు, కేశఖండనశాల, మంచినీరు, పారిశుధ్యం, చలువ పందిళ్ల, విద్యుద్దీపాలంకరణ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు.



అడుగంటిన తాగునీటి చెరువును పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి చెరువులో క్లోరినేషన్‌కు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, మార్చి 20 : అడుగంటిన తాగునీటి చెరువు క్లోరినేషన్‌కు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజయ్, పంచాయతీ కార్యదర్శి నాగబాబు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 19న 'ఉత్తమ పంచాయతీలో దాహం కేకలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రతకు చెరువు నీరు మారింద న్నారు. తాగునీరు విడుదల చేయగానే పెదలంకలో అడుగంటిన తాగునీటి చెరువును నింపటానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఇరిగేషన్ ఉన్నతాధికారులు తెలియజేశారన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో తాగునీటి వంతు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. అప్పటి వరకు ఈ చెరువులో నీటిని పొదుపుగా వాడు కోవాలన్నారు. సర్పంచ్ లక్ష్మీ రామకృష్ణ, వీఆర్వో జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కలిదిండి, మార్చి 20 : భాస్కరరావుపేటలో నిర్మించిన రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, బీజేపీ నాయకులు శివశంకర్, సర్పంచ్ ఆనంద్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




జలలింగేశ్వరాలయంలో ప్రతిష్ఠోత్సవాలు

కైకలూరు, మార్చి 20: కైకలూరు మండలం గోనెపాడులో జలలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం యంత్రప్రతిష్ఠ, మహాగణపతి, నవగ్రహాలు, నాగదేవత, అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను వేలాదిమంది భక్తుల శివనామస్మరణాల మధ్యన నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కన్నులపండువగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భారీ అన్నసమారాధన నిర్వహించారు.

జల్లులతో పొగాకు రైతుల ఆందోళన



ముసునూరులో పొగాకు పందిరిపై పరదాలు

ముసునూరు, మార్చి 20: వాతావరణం మార్పులు, భారీ వర్షాల హెచ్చరికతో పొగాకు రైతుల్లో ఆందోళన వ్యక్తమవౌతోంది. బుధవారం ఆకాశం మేఘావృతమై చిరుజల్లు కురిసింది. దీంతో రైతులు పందిళ్ళపై ఉన్న పొగాకు పంటను పరదాలు వేసి కప్పారు. మండల వ్యాప్తంగా సుమారు 850 ఎకరాల్లో పొగాకు పంట సాగైంది. 60 శాతం పైగా పంట రైతుల చేతికందగా 35 శాతం పందిళ్ళపై ఉంది. ఇంకా కొంత కోత కోయాల్సి ఉంది. అయితే ఈ ఏడాది నాటు పొగాకు వేసిన తరువాత రబీ సీజన్‌లో అధిక వర్షాల వల్ల ఆర్థికంగా నష్టపోయారు. మరలా వేసిన పంటను సైతం దున్ని ఇతర ప్రాంతాల నుంచి పొగాకు నారును కొనుగోలు చేసి పంట వేశారు. పంట చివరి దశలో పందిళ్ళపై ఉండగా వర్షం కురిస్తే ఆర్థికంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పుట్టి పొగాకు రూ.30 వేలు ధర ఉందని, భారీ వర్షాలు కురిసి పంట తడిస్తే సగం ధర కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ సమాచారం మేరకు భారీ కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎం.మధుమోహన్ సూచించారు. ముఖ్యంగా పొగాకు పందిళ్ళపై సాధ్యమైనంత వరకు పరదాలు వేసుకుని పొగాకు తడవకుండా కాపాడుకోవాలన్నారు.



వైసీపీ రంగులతో నూజివీడు పీఏసీఎస్ బిల్డింగ్

అయినా.. రంగు మారలేదు..

కోడ్ అమల్లోకి వచ్చినా భవనంపై తొలగని వైసీపీ రంగు

నూజివీడు టౌన్, మార్చి 20: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు నాలుగు రోజులు గడుస్తున్నా నూజివీడు పట్టణంలోని పీఏసీఎస్ బిల్డింగ్‌కు వేసిన వైసీపీ రంగులు తొలగించలేదు. కోడ్ నేపథ్యంలో ఏదో మొక్కుబడిగా కొన్ని కాగితాలు అంటించడంతో సరిపెడుతున్న అధికారులు ఎన్నికల నిబంధనలకు మాత్రం తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూజివీడు పీఏసీఎస్ బిల్డింగ్‌కి ఉన్న రంగులు, నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల వద్ద గల వైఎస్సార్ మహిళా మార్ట్ బోర్డు రంగులు అలాగే ఉండటం గమనార్హం.

అభ్యర్థి ఎన్నికల వ్యయంలో లెక్కిస్తాం..

ముదినేపల్లి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు అధికారులు తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ముదినేపల్లి మండలంలోని ఒక గ్రామంలో ప్రైవేట్ గృహం వద్ద ఉన్న సీఎం ఫొటో ఫ్లెక్సీని సిబ్బంది తొలగించారు. ప్రైవేట్ స్థలాల్లో ఫ్లెక్సీలు ఉంటే రిటర్నింగ్ అధికారి అనుమతి, గృహ యజమానితోపాటు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి లెటర్ కూడా అవసరమని, ఆ ఫ్లెక్సీకి అయిన ఖర్చు అభ్యర్థి ఎన్నికల వ్యయంలో కలుస్తుందని అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రైవేట్ స్థలాల్లోని ఫ్లెక్సీలను తొలగించేందుకు యజమానులు ముందుకు వస్తున్నారు. బుధవారం తహసీల్దార్ లక్ష్మీ నరస కుమారి, ఎంపీడీవో గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ గ్రామాల్లో కోడ్ అమలుపై వీఆర్వోలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో చర్చించారు.

కాంట్రాక్ట్‌లపైనే దృష్టి.. అభివృద్ధిపై లేదే



రామాయమ్మరావుపేటలో మాట్లాడుతున్న పార్థసారథి

నూజివీడు, మార్చి 20: నూజివీడు ఎమ్మెల్యే తన కుమారుడి కాంట్రాక్ట్‌ల కోసం తిరిగినన్నిసార్లు నూజివీడు అభివృద్ధి కోసం తిరిగి ఉంటే ఈ ప్రాంత అభివృద్ధి ఎప్పుడో జరిగి ఉండేదని నూజివీడు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన పట్టణంలోని రామాయమ్మరావుపేటలో 'మన ఇంటికి మన సారథి' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానికుల నుంచి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందు హడావిడి శంకుస్థాపనలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. దాదాపు 15 ఏళ్ల క్రితం నూజివీడుకు కృష్ణాజలాల తరలింపును మంజూరు చేయగా నేటికీ పట్టణంలో పూర్తిస్థాయిలో అవి అందటం లేదని, మరి నూజివీడు అభివృద్ధి తానే చేశానని చెప్పుకునే అర్హత స్థానిక ఎమ్మెల్యేకి ఎక్కడ ఉందన్నారు. పక్కరాష్ట్రాల ముఖ్యమంత్రులు పరిశ్రమల కోసం పారిశ్రామికవేత్తల వద్దకు పరుగులు తీస్తే ఈయన మాత్రం తనకాళ్ళవద్దకే పారిశ్రామికవేత్తలు రావాలనేలా వ్యవహరించారని, అందుకే మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో అశోక్ లేలాండ్ జగన్‌రెడ్డి వచ్చాక పూర్తిగా మూతపడిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ళల్లో ఉన్నప్పుడే రాష్ట్ర భవిష్యత్తు ముందుకు సాగుతుందని అందుకు చంద్రబాబు తిరిగి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కౌన్సిలర్ కొమ్మని విజయ, యార్లగడ్డ ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు కృష్ణ, పాదం సత్యనారాయణ, కందిపల్లి చెన్నారావు, అన్నేనాని, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, నూజివీడు మండల, పట్టణ, టీడీపీ అధ్యక్షులు ముసునూరి రాజా, మల్లిశెట్టి జగదీష్, పట్టణ టీడీపీ కార్యదర్శి పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేశారు..

ముసునూరు: రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పిన వైసీపీ అధికారంలోకి వచ్చాక వారిని మోసం చేసిందని కూటమి నూజివీడు అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం గుళ్ళపూడి, గుడిపాడు గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సబ్సిడీపై వ్యవసాయ పరికరాల ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అన్నారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తిచేయలేదని, ధరల స్థిరీకరణ హామీ ఏమైందో చెప్పాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పూర్తికావాలన్నా, రైతులకు సబ్సిడీ పథకాలు అందాలన్నా, వ్యవసాయం లాభసాటి కావాలన్నా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అలాగే నూజివీడులో టీడీపీ విజయానికి శ్రేణులంతా ఐక్యంగా కృషిచేయాలని పార్థసారథి కోరారు. పార్టీ అధ్యక్షులు దేవినేని ఢలరాం, గ్రామపార్టీ అధ్యక్షులు మండలపు బుజ్జియ్య నాయకులు కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబు, మసిముక్కు సుబ్బారావు, మండలపు ధర్మరాజు, కొల్లి కృష్ణయ్య, నూతక్కి వేణుగోపాల్, జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, పాశం నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



అక్కిరెడ్డిగూడెంలో సాయుధ బలగాల కవాతు

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి

ముసునూరు, మార్చి 20: ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని నూజివీడు సీఐ కె.రామకృష్ణ అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బుధవారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, చెక్కపల్లి గ్రామాల్లో సీఐ, ఎస్ఐ పి.వాసు ఆధ్వర్యంలో సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సి విధి విధానాలపై ప్రజలకు సీఐ వివరించారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా, ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ముదినేపల్లి రూరల్, మార్చి 20: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎస్ఐ వెంకట కుమార్ కోరారు. ఎన్నికల దృష్ట్యా పలు గ్రామాల్లో ఆయన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రచారాల్లో ఎలాంటి విభేదాలకు తావులేకుండా చూడాలని, శాంతిభద్రతల ఉల్లంఘన జరిగితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఏరియా ఆసుపత్రి వైద్యులు

నోటి పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నూజివీడు టౌన్, మార్చి 20: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నరేంద్ర సింగ్ మాట్లాడుతూ నోరు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రాకుండా చూసుకోవచ్చన్నారు. మద్యపానం, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. నూజివీడు త్రివిధ పాఠశాలలో నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో జాస్తి జగన్మోహన్‌రావు మాట్లాడుతూ నోటిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం

ఆగిరిపల్లి, మార్చి 20: ఆగిరిపల్లి స్టేట్ బ్యాంకు సమీపాన జనరిక్ మందుల షాపును ఎమ్మెల్యే ప్రతాప్‌అప్పారావు ప్రారంభించారు. పేదలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు లభ్యమవుతాయని, పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా మూడోరోజు టెన్త్ పరీక్షలు



నూజివీడు పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

నూజివీడు టౌన్, మార్చి 20: 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మూడోరోజు ఆంగ్ల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నూజివీడు డివిజన్ పరిధిలోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల పరిధిలో మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో 3,494 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 3,311 మంది విద్యార్థులు హాజరై 183 మంది గైర్హాజరు అయ్యారు. ఇందులో 3,346 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను, 3,260మంది విద్యార్థులు హాజరై 86 మంది గైర్హాజరయ్యారు. ఇక ప్రైవేట్ విభాగంలో 148 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 51 మంది విద్యార్థులు హాజరై 97 మంది గైర్హాజరయ్యారు.

ఆగిరిపల్లి: మండలంలో టెన్త్ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్లో 210 మందికి 207 మంది, ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో 174 మందికి 173, ఎస్వీ పబ్లిక్ స్కూల్లో 210 మందికి 208 మంది హాజరైనట్టు ఎంఈవో సర్వేశ్వరరావు తెలిపారు.

ముసునూరు: మండలంలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ముసునూరు జడ్పీ పాఠశాల పరీక్ష కేంద్రంలో 205 మందికి 199 మంది హజరయ్యారు. గోపవరంలో 165 మందికి గాను 152 మంది, చెక్కపల్లిలో 254 మందికి గాను 234 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ వాసు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

చాట్రాయి: చాట్రాయి జడ్పీ హైస్కూల్, ఆర్సీయం స్కూల్ పరీక్షా కేంద్రాల్లో బుధవారం జరిగిన టెన్త్ పరీక్షలకు 27 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. మొత్తం 378 మందికి గాను 351 మంది హాజరయ్యారని వివరించారు.

ముదినేపల్లి: పదవ తరగతి పరీక్షలు ముదినేపల్లి మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలకు 664 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 48 మది గైర్హాజరయ్యారు. ముదినేపల్లి సహాయ మాతా హైస్కూల్‌లో 16 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడుగురు, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నలుగురు, పెదగొన్నూరు హైస్కూల్‌లో రెగ్యులర్ విద్యార్థులు ఐదుగురు, ప్రైవేట్ విద్యార్థులు 16 మంది ఇంగ్లీష్ పరీక్షకు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. ఇంగ్లీష్ పరీక్ష కావటంతో సిబ్బంది విద్యార్థులను నిశితంగా పరిశీలించి పరీక్ష హాలుకు పంపారు.

డీఈవో, స్క్వాడ్ ముమ్మర తనిఖీలు

కలిదిండి: మండలంలో పది పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం ఇంగ్లీష్ పరీక్షకు 915 మంది విద్యార్థులకు గానూ 859 మంది విద్యార్థులు హాజరు కాగా, 56 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. ఎస్ఐ ప్రియకుమార్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

డీఈవో తనిఖీలు..

ముదినేపల్లి, మార్చి 20 : మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను బుధవారం విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. డీఈవో అబ్రహంతోపాటు ప్రత్యేక బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాలను తనిఖీలు చేశారు. డీఈవో అబ్రహం ముదినేపల్లి, పెదగొన్నూరు జడ్పీ హైస్కూళ్లలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెదగొన్నూరు హైస్కూల్ పరీక్షా కేంద్రానికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిగురుకోట హైస్కూలు విద్యార్థులను కేటాయించటంపై డీఈవో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణమోహన్‌ను ఆరా తీశారు. దగ్గరలోని పరీక్షా కేంద్రాలకు పంపకుండా దూర ప్రాంతంలోని పెదగొన్నూరు హైస్కూలుకు పంపటంపై అసహనం వ్యక్తం చేశారు. డీఈవో తనిఖీ చేసి వెళ్లిన కొద్దిసేపటికే పెదవేగి ఎంఈవో బుధ వాసు ఆధ్వర్యంలో స్క్వాడ్, కలిదిండి ఎంఈవో ప్రభాకర్ ఆధ్వర్యంలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ముదినేపల్లిలోని హైస్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాలు, పెదగొన్నూరు హైస్కూలు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు విజయ కుమార్, ఉదయ భాస్కర్‌తో అధికారులు చర్చించి పరీక్షల నిర్వహణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దివ్యాంగ విద్యార్థిని పరీక్షించిన డీఈఓ

ముదినేపల్లి మండలం పెదగొన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న రోహిత్ కుమార్ అనే దివ్యాంగుడిని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం పరిశీలించారు. విద్యార్థికి సహాయకుడిని ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. ప్రశ్నలకు ఆ దివ్యాంగ విద్యార్థి చెప్పిన సమాధానాల పట్ల డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో అధికారుల పర్యటన

ముసునూరు, మార్చి 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన రమణక్కపేట, కాట్రేనిపాడులో ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి, ఎస్ఐ పి.వాసు, ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. కోడ్ అమలును అధికారులు పరిశీలించి రమణక్క పేటలో శిలాఫలకంపై గల నాయకులు, వారి పేర్లకు స్టిక్కర్లు వేయించారు. అలాగే మరి కొన్నిచోట్ల ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సైతం తొలగిం చారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గ్రామస్థాయి అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. అనంతరం వలంటీర్లతో సమావేశమై మాట్లాడుతూ రాజకీయ నాయకులతో కలసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవద్దని చెప్పారు. నగదు పంపిణీ చేసినా, ఓటర్లను బెదిరించినా, ఎన్నికల కోడ్ నిబంధనలను అతిక్రమించినా వలంటీర్లపై వేటు వేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ముసునూరు, మార్చి 20: మండలంలోని వలసపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.వాసు తెలిపారు. నూజివీడు మండలం రావిచర్ల గ్రామానికి చెందిన అన్నదమ్ములు మరీదు మోహన్‌కృష్ణ, కిరణ్ ఈ నెల 13న కామవరపుకోట మండలం వీరంపాలెంలో ఒక ఇంటికి వైరింగ్ పనులకు వెళ్లి రాత్రి బైక్‌పై తిరిగి వెళుతుండగా వలసపల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అన్నదమ్ములకు తీవ్ర గాయాలు కాగా వారిని 108లో ఏలూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై వీరి పెద్ద సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



టెక్‌జెట్ 24 పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్

12 నుంచి ఆర్జీయూకేటీలో టెక్‌జెట్

నూజివీడు టౌన్, మార్చి 20:రాజీవ్ గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నిర్వహించే టెక్‌జెట్ ప్రోగ్రాంను ఏప్రిల్ 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టెక్‌జెక్ -24 పోస్టర్‌ను, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో వివిధ వర్సిటీల్లో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా ప్రతి ఏటా టెక్‌జెట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి వర్సిటీలు, కళాశాలలకు ఆహ్వాన పత్రికలను పంపామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, కన్వీనర్ జ్యోతిలాల్ నాయక్, డీన్‌లు శ్రావణి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలకు రూ.లక్ష వితరణ



ఆగిరిపల్లి, మార్చి 20: ఆగిరిపల్లి వేదపాఠశాల అభివృద్ధి, నిర్వహణ నిమి త్తం పాఠశాల పూర్వవిద్యార్థి, మచిలీప ట్నానికి చెందిన జోస్యుల రామ్‌ప్రసాద్ లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈయన మచిలీపట్నం హిందూ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. తాను విద్యను అభ్యసించిన పాఠశాలకు విరాళం ఇవ్వడం ఆనందంగా ఉందని రామ్‌ప్రసాద్ తెలిపారు. వేదపాఠశాల కార్యదర్శి సూరిశర్మ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ బార్ అసోసియేషన్ నూజివీడు కార్యవర్గం




సత్యనారాయణ, రామకృష్ణ

నూజివీడు టౌన్, మార్చి 20: భారత్ బార్ అసోసియేషన్ నూజివీడు కార్య వర్గ ఎన్నికను నూజివీడు కోర్టు హాలు ప్రాంగణంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రామిశెట్టి వెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా బసవరాజు రామకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దార్ల కుమారి, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ అర్జున్‌రావు, కోశాధికారిగా బి.దేవదాసు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వేలం వాయిదా

ముదినేపల్లి రూరల్, మార్చి 20: ఎన్నికల కోడ్ కారణంగా సింగరాయపాలెం, చేవూరిపాలెం సెంటర్లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంకు సంబంధించి వేలం పాటలను వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నీలసంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. కోడ్ ముగిసిన అనంతరం పాట నిర్వహిస్తామని వివరించారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



మండవల్లి, మార్చి 20: రాజ్యాంగ విలువలను నేటి బాలలకు నేర్పిం చటం అవసరమని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. ఆనందపురం లో ఐసీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం జి. శామ్యూల్ అధ్యక్షతన బుధవారం రాజ్యాంగ పీఠికపై అవగాహన సమావేశం నిర్వహించారు. బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకంలోని చిత్రాలను విద్యార్థులకు చూపి, చదివించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ దేశ జనాభాలో 15 ఏళ్ళలోపు చిన్నారులు 40 కోట్లు ఉన్నారని వారందరికీ బాల్యం నుండే రాజ్యాంగ విలువలు నేర్పటం వల్ల భారతావని ముఖచిత్రాన్ని మార్చవచ్చన్నారు. రాజ్యాంగాన్ని తయారుచేసుకుని ఏడు దశాబ్దాలు దాటినా రాజ్యాంగంలోని అనేక చట్టాలు, నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, అందువల్ల ప్రతి పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన అవసరమన్నారు.

వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలి



పీహెచ్‌సీల సమస్యలు తెలుసుకుంటున్న వైద్యాధికారిణి శర్మిష్ఠ

మండవల్లి, మార్చి 20: వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ఠ సూచించారు. బుధవారం మండవల్లి మండలంలోని లోకుముడి సబ్ సెంటర్, తక్కెళ్ళపాడు పీహెచ్‌సీలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది ప్రతీ రోజూ ఉదయం 9గంటలకే విధులకు హాజరు కావాలని ప్రతీ ఒక్కరూ ఫేస్ రికగ్నైజ్ యాప్‌లో హాజరు వేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పీహెచ్‌సీలలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటుగా ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామాలయ నిర్మాణానికి రూ.10 వేలు విరాళం

కైకలూరు, మార్చి 20: రామాలయ నిర్మాణానికి బీకేఎం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. బుధవారం కైకలూరు మండలం వేమవరప్పాడులో రామాలయ పునఃనిర్మాణానికి ట్రస్ట్ సభ్యుడు బోడావుల శివాజీ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్థులు బోడావుల వసంతరావు, నున్న వెంకన్న, నాగనబోయిన మాధవ, బోడావుల వడ్డికాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కలిదిండి, మార్చి 20 : మండలం లో వెంకటాపురం, పోతుమర్రు, చిన తాడినాడల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దశిక వంశీ, ఎస్ఐ ప్రియ కుమార్, ఆర్ఐ విజయలక్ష్మి బుధవా రం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ రావటంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సమాచార డిస్‌ప్లే బోర్డులను కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

గోరుముచ్చుకు తెలుగు తమ్ముళ్ల శుభాకాంక్షలు



చాట్రాయి, మార్చి 20: రామన్నపాలెంలో బుధవారం జరిగిన ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ యువ నాయకుడు గోరుముచ్చు గోపాల్ యాదవ్ జన్మదిన వేడుకల్లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు పానుగళ్ళ కోటేశ్వరరావు, పార్టీ మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, బొర్రా నాగేశ్వరరావు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహార ప్రాముఖ్యత తెలుసుకోవాలి

చాట్రాయి, మార్చి 20: పౌష్టికాహార ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలని నూజివీడు డివిజన్ ఐసీడీఎస్ సీడీపీవో నూరాని కోరారు. మండలంలోని తుమ్మగూడెం అంగన్వాడీ కేంద్రంలో బుధ వా రం జరిగిన పోషణ వేడుకలో ఆమె మా ట్లాడుతూ నిత్యం తినే ఆహారం ద్వారా సరైన పోషక విలువలు శరీరానికి అందకపోవటం వల్ల అనారోగ్య సమస్యలతో అన్ని వయస్సుల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవనంలో పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. పౌష్టికాహారంపై తల్లులు, గర్భవతులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్ గాయత్రి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.